ఐవీఎఫ్ చికిత్స వికటించి

మహిళ మృతి


మేరిపరిణీత (ఫైల్)

హైదర్‌నగర్, జూన్8(ఆంధ్రజ్యోతి): సంతానం కొరకు ఐవీఎఫ్ ట్రీట్మెంట్ చేయించుకుంటున్న మహిళ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందింది. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట కుందన్‌బాగ్‌కు చెందిన కరుణాకర్‌రెడ్డి భార్య మేరి పరిణీత(38)కు వివాహం అయి చాలా కాలమైనా సంతానం కలుగలేదు. దీంతో 9 నెలల క్రితం కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-6లో ఉండే డాక్టర్ నీరజ ఫెర్టిలిటీ సెంటర్‌లో డాక్టర్ నీరజవల్లిని సంప్రదించారు. అప్పటి నుంచి ఐవీఎఫ్ ట్రీట్మెంట్ అందిస్తోంది. గతనెల 31న కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్-1లోని ప్రసాద్ ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో నీరజవల్లి ఐవీఎఫ్ ప్రాసెస్ చేస్తుండగా పరిణీతకి హార్ట్‌ఎటాక్ వచ్చిందని చికిత్స నిమిత్తం మరో ఆస్పత్రికి తరలించాలని భర్త కరుణాకర్‌రెడ్డికి తెలపడటంతో హుటాహుటిన హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త కరుణాకర్‌రెడ్డి ప్రసాద్ ఆస్పత్రి వద్దకు పరిణీత మృతదేహంతో వచ్చి తన భార్య మృతికి ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యమే కారణమని నిలదీశాడు. డాక్టర్ నీరజవల్లి, ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది సర్దిచెప్పి ముందు అంత్యక్రియలు పూర్తి చేసి రండి.. తర్వాత మాట్లాడుదాం అని ఒప్పించి పంపించారు. ఈనెల 5వ తేదీన డాక్టర్ నీరజవల్లి వద్దకు వచ్చిన కరుణాకర్‌రెడ్డి తన భార్య మరణానికి కారణం అడుగగా ఆమె నుంచి సరైన స్పందన రాలేదు. దీంతో ఆగ్రహించిన కరుణాకర్‌రెడ్డి కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరిణీత మృతదేహాని వెలికితీసి గాంధీ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు, మెడికల్ ఫైల్స్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.


కార్పొరేటర్లు, బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

కూకట్‌పల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి ముగియడంతో పాటు వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్పొరేటర్లు, బీఆర్ఎస్ శ్రేణులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. కూకట్‌పల్లిలోని తన నివాసంలో శనివారం నియోకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, ముఖ్యనాయకులతో ఆయన సమావేశమయ్యారు. కార్పొరేటర్లు ఆయా డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు ముద్దం నర్సింహ యాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందాడి శ్రీనివాసరావు, శ్రీహరి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

జెడ్సీతో ఎమ్మెల్యే గాంధీ సమావేశం


జెడ్సీ అభిలాష అభినవ్‌తో ఎమ్మెల్యే గాంధీ

కూకట్‌పల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ (జెడ్సీ) అభిలాష అభినవ్‌ను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కలిసి శనివారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యలపై యంత్రాంగం అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎమ్మెల్యే సూచించిన సమస్యలపై చర్యలు తీసుకొంటామని జెడ్సీ తెలిపారు.

అనారోగ్యంతో యాచకురాలి మృతి


సయ్యద్‌సమీన

అల్లాపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందింది. అల్లాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సయ్యద్ సమీన(34) భర్త సలీం భిక్షాటన చేసుకునేవారు. ఖాజాబాబా దర్గా వద్ద నివాసం ఉన్న ఆమె అనారోగ్యంతో ఉస్మానియా ఆస్పత్రిలో చేరింది. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి గురువారం రాత్రి 10 గంటలకు విషమించడంతో మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో ఉంచినట్టు అధికారులు తెలిపారు. ఆమె కుటుంబసభ్యులు, బంధువులు అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ నెంబర్ 87126 63699, 87126 63335, 87126 63693లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

కుటుంబకలహాలతో మహిళ ఆత్మహత్య


భవానీ మృతదేహం

జీడిమెట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో ఓ గృహిణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైసమ్మనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైసమ్మనగర్‌లో నివాసముంటున్న కమ్మరి భవాని(32), భానుచందర్‌లు భార్యాభర్తలు. వీరికి 10 ఏళ్లక్రితం వివాహం అయింది. కొంతకాలంగా తరుచూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం


నారాయణస్వామి

బాలానగర్, మే 8(ఆంధ్రజ్యోతి): పనికి వెళ్తున్నానని భార్యకు చెప్పి బయటకు వెళ్లిన మేస్త్రీ (భవన నిర్మాణ కార్మికుడు) ఇంటికి తిరిగి రాలేదు. బాలానగర్ ఫిరోజ్‌గూడలో నివాసముండే గంటా నారాయణ స్వామి(40) భవన నిర్మాణ పనుల్లో మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈనెల 3వ తేదీ ఉదయం పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లాడు. ఐదు రోజులైనా తిరిగి రాకపోవడంతో అతడి భార్య భాగ్యమ్మ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నారాయణ స్వామిని ఆచూకీ తెలిస్తే 94906 17114లో సమాచారం ఇవ్వాలని సీఐ నవీన్‌కుమార్ సూచించారు.

సూరారం విశ్వకర్మ కాలనీలో యువతి..


లావణ్య

గాజులరామారం: ఇంట్లో పని చెయ్యడం లేదని తల్లి మందలించడంతో కూతురు ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం విశ్వకర్మ కాలనీలో ఉండే కుమారయ్య, శశికళ కూతురు లావణ్య (22) ఈనెల 5న తల్లి శశికళ కూతురు లావణ్యను ఇంట్లో పని చెయ్యలేదని మందలించింది. బయట అరుగు మీద కూర్చున్న లావణ్య కనిపించలేదు. దీంతో చుట్టు ప్రక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో సూరారం పోలీసులకు శశికళ ఫిర్యాదు చేసింది.

బయటకు వెళ్లిన భర్త..


నగేష్

గాజులరామారం: ఇంటినుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగి రాలేదు. సూరారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూరారం సాయిబాబానగర్‌కు చెందిన నాగమణి, నగేష్ (35) దంపతులు మే 15న ఇంటి నుంచి బట్టలు తీసుకొని భార్యకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భర్తకు నాగమణి ఫోన్ చెయ్యగా ఫోన్ ఎత్తినా గుర్తు తెలియని వ్యక్తి బూతులు తిడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నది. గతంలో నగేష్ రెండు సార్లు బయటకు వెళ్లి, రెండు నెలల తరువాత తిరిగి వచ్చాడని తెలిపింది. శనివారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలానగర్ బ్రిడ్జి కింద అక్రమ పార్కింగ్

వ్యాపారులు, కస్టమర్ల కోసం కేటాయింపు


బ్రిడ్జి కింద పార్కు చేసిన జేసీబీలు, రోజుల తరబడి పార్కు చేసిన వాహనాలు

రోజుల తరబడి జేసీబీలు, ప్రైవేటు వాహనాల పార్కింగ్

ఖాళీలేక రోడ్లపైనే వ్యాపారులు, కస్టమర్ల వాహనాలు

చలాన్లు వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బాలానగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ఫ్లై ఓవర్ కింద అక్రమ పార్కింగులపై స్థానికులు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఆర్ఎస్‌కే ఎదురుగా ఫ్లై ఓవర్ కింద వ్యాపారులు, కస్టమర్ల వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో జేసీబీలు, ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ఖాళీ స్థలం లేకపోవడంతో తమ వాహనాలు ఎక్కడ పార్క్ చేయాలని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారులు, కస్టమర్లు తమ వాహనాలను రోడ్ల పైన నిలుపుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు చలానాలు వేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఆర్ఎస్సీ నిధులతో నిర్మించిన బాలానగర్ ఫ్లై ఓవర్ నిర్మించారు. దీంతో రోడ్డు పక్కన ఉన్న దుకాణాలకు పార్కింగ్ స్థలం లేకుండా పోయింది. పార్కింగ్ స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని దుకాణ యజమానులు ఎమ్మెల్యేకు విన్నవించడంతో ఫ్లై ఓవర్ కింద స్థలం కేటాయించారు. అభివృద్ధి పనులు, గార్డెన్, గ్రీనరీ, యూ టర్న్‌లను ఏర్పాటు చేశారు. స్థానిక వ్యాపారులు, దుకాణదారుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.19.50 లక్షల నిధులు సమకూర్చి పనుల కోసం శంకుస్థాపన చేశారు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో బ్రిడ్జి కింద ఉన్న పార్కింగ్ స్థలం ఖాళీగా ఉంది. దీంతో ఆ స్థలం ప్రైవేటు వ్యక్తుల అడ్డాగా మారింది. ఫ్లై ఓవర్ కింద పార్కింగ్ స్థలంలో కొందరు జేసీబీలు, ఇతర పెద్దపెద్ద వాహనాలు తెచ్చి ఖాళీ స్థలం లేకుండా రోజుల తరబడి నిలుపుతున్నారు. దీంతో వ్యాపారులు, కస్టమర్లు నిలపడానికి స్థలం లేకపోవడంతో తమ వాహనాలను వారు రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు చలానాలు వేస్తున్నారని వాపోతున్నారు. అక్రమంగా పార్కింగ్ చేసిన యజమానులు ఎవరికీ తెలియకపోవడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

వాహనాల మధ్య అసాంఘిక కార్యక్రమాలు

రాత్రి పూట కొందరు ఆకతాయిలు ఎవరికీ కనపడకుండా పెద్దపెద్ద వాహనాల మధ్య కూర్చుని గంజాయి, మద్యం సేవిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌లను తొలగించి వ్యాపారుల వాహనాలు పార్క్ చేసే విధంగా బ్రిడ్జి కింది స్థలాన్ని సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పార్కింగ్ సమస్యను పరిష్కరించాలి



2021లో పార్కింగ్ స్థలానికి నిధులు ఇచ్చి పనుల కోసం ఎమ్మెల్యే కృష్ణారావు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అక్కడ ఎలాంటి పనులు జరుగలేదు. దీంతో ప్రైవేటు వ్యక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. రాత్రి పూట కొందరు గంజాయి, మద్యం సేవిస్తు రోడ్డుపై వెళుతున్న పాదాచారులు, వాహనాదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త టెండర్లను ఆహ్వానించి పార్కింగ్ స్థలాన్ని అభివృద్ధి చేసి పార్కింగ్ సమస్యను పరిష్కరించాలి.

- పులి శివకుమార్‌గౌడ్, అధ్యక్షుడు బాలానగర్ ల్యాండ్, మర్చంట్ ఓనర్స్ అసోసియేషన్

తాగుబోతులకు అడ్డాగా మారింది



నిధులు కేటాయించామని రెండు సంవత్సరాలుగా చెబుతున్నారు. పనుల కోసం ఎమ్మెల్యే కృష్ణారావు సైతం శంకుస్థాపన చేశారు. అయినా పనులు ముందుకు సాగడం లేదు. బ్రిడ్జి కింది ప్రాంతం పబ్లిక్ పార్కింగానే కాకుండా తాగుబోతుకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తే బాగుటుంది.

- శ్రీధర్, అడ్వకేట్ జనరల్ సెక్రటరీ, ల్యాండ్, మర్చంట్ ఓనర్స్ అసోసియేషన్

ఎప్పుడూ ప్రైవేటు వాహనాలే ఉంటున్నయ్

దుకాణాల ఓనర్ల వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు స్థలం కరువైంది. పార్కింగ్ స్థలంలో ఎప్పుడూ జేసీబీలు, భారీ వాహనాలు, కార్లు రోజుల తరబడి నిలిపి ఉంటున్నాయి. అవి ఎవరివో వివరాలేవి తెలియదు. దుకాణాలకు వచ్చే కస్టమర్లు తమ వాహనాలు రోడ్డు పక్కనే పార్కు చేసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు చలానాలు విధిస్తున్నారు. వాహన దారులకు ఇబ్బంది కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందిచి తగిన చర్యలు చేపట్టాలి.

- జి.శ్రీధర్‌గుప్తా, జిరాక్స్ షాపు నిర్వాహకుడు

పనులపై సమీక్షిస్తాం

కేపీహెచ్‌బీ మాల్ వద్ద చేసిన విధంగా రూ.50 లక్షలతో స్మార్ట్ పార్కింగ్ చేద్దామని ప్రణాళికను సిద్ధం చేశాం. టెండర్లను ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు పెండింగ్ పడ్డాయి. ఇంతకాలం ఎన్నికల కోడ్ ఉందని ఆగాం. వారం రోజుల్లో పనులపై సమీక్షిస్తాం. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోయినా పార్కును డెవలప్ చేస్తాం.

- గోవర్ధన్‌గౌడ్, ఈఈ, కూకట్‌పల్లి సర్కిల్

గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవచ్చు

- అర్హత కల్గిన వారికి జిరో బిల్లులు
- రంగారెడ్డిజోన్‌లో 3.73 లక్షల లబ్ధిదారులు
- రంగారెడ్డి జోన్ సీజీఎం పి.ఆనంద్


ఆనంద్

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అర్హత కల్గిన విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకానికి ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని రంగారెడ్డి జోన్ సీజీఎం పి.ఆనంద్ శనివారం తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియడంతో తెల్లరేషన్ కార్డు కలిగి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న వారంతా జిరో బిల్లుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎమ్మెల్సీ, సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగియడంతో రంగారెడ్డి జోన్ పరిధిలోని సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్లలో జూన్ 6 నుంచే జిరో బిల్లులు జారీ చేస్తునట్లు తెలిపారు. రంగారెడ్డి జోన్ నాలుగు సర్కిళ్లలో 3 లక్షలా 73 వేలా 400 మంది గృహజ్యోతి లబ్ధిదారులున్నారని అత్యధికంగా వికారాబాద్ సర్కిల్‌లో 1 లక్షా 14 వేలా 455 లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 1 లక్షా 01 వేయి 737, సరూర్‌నగర్‌లో 93 వేలా 516, సైబర్‌సిటీ సర్కిల్‌లో 63 వేలా 692 మంది గృహజ్యోతి లబ్ధిదారులునట్లు తెలిపారు. జోన్ వ్యాప్తంగా జీరో బిల్లులు జారీ చేస్తున్నామని, అయినా కొంతమంది దరఖాస్తు చేసుకునేందుకు స్థానిక విద్యుత్ కార్యాలయాలకు వస్తున్నారని, అర్హత కల్గిన వారంతా ప్రజాపాలన సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వారి వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయగానే జిరో బిల్లు జారీ అవుతుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని అర్హులు గృహజ్యోతి కింద జీరో బిల్లు పొందొచ్చన్నారు.

రివార్డు, గిఫ్ట్ కూపన్‌ల పేరుతో సైబర్ వల



వాట్సాప్ గ్రూప్‌లో సందేశం

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రగతినగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి చైతన్యకు స్టేట్ బ్యాంక్ పేరుతో వాట్సాప్‌లో ఓ సందేశం వచ్చింది. మీ బ్యాంక్ ఖాతాకు ఎస్‌బీఐ రివార్డు రూ. 7,250 యాక్టివేట్ అయిందని, ఈ రోజుతో దాని కాలపరిమితి ముగుస్తుందని మెసేజ్ వచ్చింది. రివార్డు కావాలంటే కింద పంపిన లింక్ ద్వారా ఎస్‌బీ రివార్డు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని, క్లెయిమ్ చేసుకుంటే మీ ఖాతాలో డబ్బు జమ అవుతాయని సందేశంలో ఉంది. తన నెంబర్‌తోపాటు, స్నేహితులు, సహోద్యోగులు ఉన్న వాట్సాప్ గ్రూపులో కూడా ఇదే మెసేజ్ రావడంతో కొంతమేరకు నమ్మకం వచ్చింది. స్నేహితుడు కూడా ఇదే మెసేజ్ పంపడం, మెసేజ్ వచ్చిన నెంబర్ డీపీలో బ్యాంక్ లోగో ఉండడం, చాలాకాలంగా ఎస్‌బీఐ ఖాతా ఉండడంతో రివార్డు నిజమని భావించిన చైతన్య ఏపీకే లింక్‌ను ఓపెన్ చేశాడు. ఎస్‌బీఐని పోలిన వెబ్‌సైట్(ఎస్‌బీఐ రివార్డ్స్) ఓపెన్ కావడంతో, ఖాతా వివరాలు, కార్డు, సీవీవీ వివరాలు నమోదు చేశాడు. కొంతసేపటికి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు విత్‌డ్రా అయినట్లు సందేశాలు రావడంతో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమాచారం చోరీ

ఓటీపీ, ఓఎల్ఎక్స్ మోసాలపై అవగాహన పెరడగంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో ముందుకు వెళ్తున్నారు. ప్రముఖ బ్యాంక్‌లు, సంస్థలు, ఈ కామర్స్ సైట్ల పేర్లను దీనికోసం వాడుతున్నారు. సిమ్‌లను సేకరించి, వాటికి ప్రముఖ సంస్థలు, బ్యాంక్‌ల లోగోలు, పేర్లు తగిలిస్తున్నారు. పలువురికి రివార్డు, ఆఫర్ కూపన్‌ల పేరుతో లింక్‌లను పంపుతున్నారు. లింక్ ఓపెన్ చేస్తే, దాని ద్వారా ఫోన్‌ను హ్యాక్ చేయడంతో పాటు సమాచారాన్ని కూడా తస్కరిస్తున్నారు.

సందేశాలు ఎక్కువ మందికి వెళ్లేలా పలు వాట్సాప్, టెలిగ్రాం గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. ఇది నిజమా? కాదా? అని కూడా నిర్ధారించకుండా కొంతమంది తమ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు ఇదే సందేశాన్ని ఫార్వర్డ్ చేస్తున్నారు. పంపింది స్నేహితుడే కదా అని, ఓపెన్ చేసిన వారు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు. ఫోన్‌లో ఉన్న సమాచారాన్ని సేకరించిన సైబర్ నేరగాళ్లు, ఖాతా వివరాలు సేకరించి డబ్బు కాజేయడంతోపాటు, సమాచారం, వీడియోలు, ఫొటోలు సేకరించి వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి సందేశాలను వెంటనే డిలీట్ చేయాలని సైబర్ క్రైం అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు.

వేసవిలో 60 వేల మందికి మజ్జిగ పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని వినాయక ఆలయ ప్రాంగణంలో వేసవిలో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రం శనివారంతో ముగిసిందని నిర్వాహకులు ఐఎస్ఎన్ రాజు తెలిపారు. వేసవిలో మండుతున్న ఎండలకు దాతల సహకారంతో 60 వేల మందికి మట్టికుండల్లో చల్లటి మజ్జిగ అందించామని, వర్షాలు పడటంతో వాతావరణం చల్లబడిందని, దీంతో మజ్జిగ కేంద్రం మూసేశామన్నారు.

కూకట్‌పల్లి జేవీవీ నూతన కార్యవర్గం ఎన్నిక


మొక్క నాటుతున్న జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రయ్య

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ ధర్మారెడ్డి ఫేజ్-1లో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శనివారం కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కేంద్రంలో ఏర్పడనున్న ప్రభుత్వం ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సైన్స్ కాంగ్రెస్, విజ్ఞాన్ ప్రసార్ వంటి వాటిని పునరుద్ధరించాలన్నారు. జేవీవీ తెలంగాణ అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముట్టవరపు రవీంద్రబాబు సమక్షంలో కూకట్‌పల్లి నూతన అధ్యక్షుడు శాంతి ఇశాన్, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, సభ్యులుగా శరత్, సుమన్, స్వాతి, ప్రసన్న, రవి శంకర్, సాయి, మహేశ్వరి, రేష్మాషేక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సికింద్రాబాద్ నుంచి 19వ భారత్ గౌరవ్ రైలు

సీనియర్ సిటిజన్స్‌తో ప్రారంభించిన అధికారులు

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాల యాత్రకు సికింద్రాబాద్ నుంచి ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసిన 19వ భారత్ గౌరవ్ రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి శనివారం ప్రారంభమైంది. దీనిని ప్రయాణికుల్లో సీనియర్లు దినేష్ చుట్కే(75), సతీమణి సాధనా చుట్కే(63) సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జెండా ఊపడంతో భారత్‌గౌరవ్ రైలు ప్రయాణం ప్రారంభమైంది. అయోధ్య-కాశీ వెళ్లే ప్రయాణీకుల నుంచి ఈ రైలు ఎంతో ఆదరణ పొందిందని, వంద శాతం పూర్తి ఆక్యుపెన్సీతో బయలుదేరిందని ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ పి.రాజ్‌కుమార్ తెలిపారు. దేశంలో ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి భారత్ గౌరవ్ రైళ్లు పెద్దపీట వేస్తున్నాయని దక్షిణమధ్య రైల్వేజీఎం పేర్కొన్నారు.

రేపటి నుంచి 13 వరకు పీజీఈసెట్ పరీక్షలు

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీజీఈసెట్) పరీక్షలు ఈ నెల 10వ తేదీ నుంచి 13 వరకు జరగనున్నాయి. ఈ సెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షాకేంద్రాలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన లోనికి అనుమతించే ప్రసక్తేలేదని సెట్ కన్వీనర్ డాక్టర్ ఎ.అరుణకుమారి తెలిపారు. పీజీఈసెట్ పరీక్షలు ప్రతిరోజూ సెషన్1లో ఉదయం 10గంటలకు, సెషన్2లో మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమవుతాయని, పరీక్ష సమయం కంటే గంటన్నర ముందుగానే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పీజీఈసెట్‌కు 22,712 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో హైదరాబాద్ జోన్ నుంచి 18,300 మంది, వరంగల్ జోన్ నుంచి 4,412మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తెలంగాణేతర అభ్యర్థులు 1,145మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 556 మంది ఆంధ్ర, 257మంది రాయలసీమకు చెందిన వారుండగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 332మంది ఉన్నట్లు కన్వీనర్ తెలిపారు. గత మూడేళ్లగా పీజీఈసెట్‌కు అభ్యర్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2022లో 14,921మంది, 2023లో 16,563 మంది, 2024లో 22,712మంది దరఖాస్తు చేసుకున్నారు.

వర్షాలతో 14 ఎంయూలు తగ్గిన విద్యుత్ డిమాండ్

- 86 నుంచి 72 మిలియన్ యూనిట్లకు పడిపోయిన వినియోగం

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో గ్రేటర్‌లో రోజు వారీ విద్యుత్ డిమాండ్ 14 మిలియన్ యూనిట్లు తగ్గింది. జూన్ 1వ తేదీన గ్రేటర్‌జోన్‌లో 86 మిలియన్ యూనిట్లుగా నమోదైన విద్యుత్ డిమాండ్ 7వ తేదీ నాటికి 72 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. వర్షాల కారణంగా నాలుగురోజులుగా రోజువారీ విద్యుత్ వినియోగం 72-73 మిలియన్ యూనిట్లుగా మాత్రమే నమోదవుతుంది. గ్రేటర్‌లో గత శనివారం(జూన్ 1న) 4,046 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదవగా, శుక్రవారం(జూన్ 7) నాటికి 3,412 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది.

- ప్రత్యేక చర్యలు

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. సెక్షన్, డివిజన్లలో అదనపు సిబ్బంది నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాటు 24 గంటలు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సిబ్బంది, ఆపరేషన్‌వింగ్ ఏఈ, ఏడీఈ, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యటించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ లైన్లపై చెట్లకొమ్మలు తొలగించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త తీగలు వేస్తున్నారు. మరమ్మతులు చేపట్టే సిబ్బంది తప్పనిసరిగా భద్రత సూత్రాలు పాటించాలని, అధికారుల పర్యవేక్షణలో పనులు నిర్వహించాలంటూ ఇప్పటికే టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ అధికారులను ఆదేశించారు.

బీసీలకు 50 శాతం కేంద్ర మంత్రి పదవులు ఇవ్వాలి


సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

బర్కత్‌పుర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ఏర్పాటు కానున్న కేంద్రమంత్రివర్గంలో 50 శాతం పదవులు బీసీలకే ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి ముగ్గురు బీసీ ఎంపీలను కేంద్రమంత్రివర్గంలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో 13 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రెండు లక్షల కోట్ల రూపాయలను కేటాయించాలని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేష్, సి.రాజేందర్, జి.అనంతయ్య, నందగోపాల్, వేముల రామకృష్ణ, ఉదయ్‌నేత, జిల్లపల్లి అంజి, మట్ట జయంతిగౌడ్, హరితిలక్‌సింగ్ పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి

మియాపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీరావు మృతితో అభిమానులు శనివారం మియాపూర్ ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దార్శనికుడు రామోజీరావు కొనియాడారు. వేలమందికి ఉపాధి చూపించి తద్వారా ఎంతోమందికి బతికేలా చేశారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఆర్‌కె ప్రసాద్, పరమేష్, వీవీ సత్యనారాయణ, గిరి, భాష, లీలాప్రసాద్, శ్రీనివాస్, సుబ్బారావు, ఆంజనేయులు, అమర్, వినోద్, అశోక్, రాజేష్, ప్రసాద్, గంగాధర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.


మియాపూర్ ఆర్‌బీఆర్ వద్ద రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు